క్లుప్తంగా

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం



గద్వాల: డ్రగ్స్ వినియోగం మానవ మనుగడకు ప్రమాదకరమని.. డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి హృదయరాజు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాలు–నివారణ చర్యలు' అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఉపన్యాస పోటీల్లో 84మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ నివారణపై అభిప్రాయాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరారెడ్డి, అధ్యాపకులు అఖిలారెడ్డి, పవన్‌కుమార్, ఖలీల్, ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న, తిమ్మప్ప, నర్సింహ, ఏలియా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌కు చెందిన సుఖవాసి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో కాకతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శాంతినగర్‌లోని సీతారాముల దేవాలయంలో మృతుడి భార్య బిందుకు రూ.1,50,000 నగదు అందజేశారు. భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్బినేని వెంకటనారాయణ, రాంబాబు, సీతయ్య, వెంకటరామన్, రమేష్, రాఘవేంద్ర, రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులు భయం వీడాలి

గద్వాల క్రైం: విద్యార్థులు భయం వీడి ధైర్యంగా ముందుకెళ్లాలని భరోసా విభాగ ఎస్‌ఐ స్వాతి అన్నారు. మంగళవారం గద్వాల మండలంలోని పూటాన్‌పల్లిలో టీజీవీబీఎస్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్దేశ పూర్వకంగా తాకడం లేదా అనుచితంగా వ్యవహరించే అంశాలపై వివరించారు. సైబర్ క్రైం, పోక్సో చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యాక్రమంలో శిరీష, శ్వేత పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

మానవపాడు: మండలంలోని 108 అంబులెన్స్‌ను మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగాం మేనేజర్ రవికుమార్, గద్వాల జిల్లా ఎగ్జిక్యూటివ్ రత్నమయ్య తనిఖీ చేశారు. పరికరాల పనితీరు, మందులు పరిశీలించారు. సిబ్బంది తక్షణమే స్పందించి సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ కల్పన, పైలెట్ కృష్ణ పాల్గొన్నారు.

వీసీల ద్వారా అవగాహన

కేటీదొడ్డి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల కేంద్రంలోని రైతునేస్తం కార్యక్రమంపై రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత హాజరై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అక్బర్, రాజవర్ధన్ రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఇటిక్యాల: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 11న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మొదటి సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్నవారందరికీ అల్బెండజోల్ మాత్రలు అందించాలని పేర్కొన్నారు.

ఆశ కార్యకర్తలతో సమావేశం

మానవపాడు: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్ హేమలత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెలెన్, అబేదుల్లా, అక్కమ్మ, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ధరూరు: మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, సంస్థ చైర్మన్ రత్నసింహా రెడ్డి, ప్రతాప్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బడిలో భయం.. భయంగా!

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- మరమ్మతు చేపట్టాలని వేడుకోలు
- మూత్రశాలలు లేక ఇబ్బందులు



ఉండవెల్లిలో శిథిలావస్థకు చేరిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పురాతన భవనం కావడంతో స్లాబు మొత్తం ధ్వంసమైంది. దీంతో నానా అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పాఠశాలలో సమస్యలు వేధిస్తున్న అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెచ్చులూడుతున్న గదులు

తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని విద్యార్థులు భయందోళనలో ఉంటున్నారు. ఒక్కో తరగతిలో మూడు సెక్షన్లు ఏర్పాటు చేయడంతో తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో ఆరుబయట కూర్చోబెట్టి పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది.

200 మంది బాలికలకు మూత్రశాల ఒక్కటే

పాఠశాలలో 200 మంది విద్యార్థినులకు వీఎస్‌టీ కంపెనీ సౌజన్యంతో నిర్మించిన మూత్రశాల ఒక్కటే ఉండడంతో బాలికలు మూత్రశాల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొందని అదే విధంగా మూత్రశాల వద్దకు వెళ్లాలంటే బురుదలో చేరుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే అంతే సంగతులు

వర్షాకాలంలో పాఠశాలలో తడిసిన గదులతో భయాందోళనలో ఉన్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. పాఠాలు వినాలా.. లేక తడిసిన గోడలను చూడాలా, ఎపుడు గోడలు మీద పడుతాయో అని భయం భయంగా బడిలో ఉన్నట్లు పేర్కొంటున్నారు.

పిల్లర్లకే పరిమితం

పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వంలో నూతన భవనం మంజూరు చేసినప్పటికీ పిల్లర్లకే పరిమితమైంది. కొత్త భవనం ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియక విద్యార్థులు సతమతమవుతున్నారు. 380 మంది విద్యార్థులకు తరగతి గదులు లేక, మూత్రశాలలు, సరిపడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.



శిథిలావస్థకు చేరిన గదిలో విద్యార్థులు



పైకప్పులో ఒరిగిన ఇనుపరాడ్లు

సరిపడా గదులు లేవు



పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. ఒక్కో తరగతిలో మూడు సెక్షన్లు ఏర్పాటు చేయడంతో గదులు సరిపోక ఆరుబయట బోధిస్తున్నారు. అదే విధంగా మూత్రశాలల సమస్య వేధిస్తోంది.

- శ్రీవాణి, పదో తరగతి

అన్నీ ఇబ్బందులే



మా పాఠశాలలో అన్ని ఇబ్బందులే ఉన్నాయి. ఎప్పుడు గోడలు కూలుతాయో, ఎక్కడ తడిసిపోతామో తెలియక భయం భయంతో పాఠాలు వింటున్నాము. నూతన భవనం త్వరగా పూర్తి చేయాలి.

-వేదవతి, పదో తరగతి

జిల్లా అధికారులకు విన్నవించాం



పాఠశాల శిథిలావస్థకు చేరడం వాస్తవమే. మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు పాఠశాల గదులను పరిశీలించారు. కలెక్టర్‌కు కూడా సమస్యలు విన్నవించాం.

- హేమలత, ప్రధానోపాధ్యాయురాలు

మహిళల సంక్షేమం కోసం కృషి



గద్వాలలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: పేదింటి ఆడపడచుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. గద్వాల పట్టణానికి చెందిన సూరమ్మకు రూ.26,500, గడ్డం భానుమతికి రూ.11,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుభాన్, గడ్డం కృష్ణారెడ్డి, హనుమంతు, వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ, చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. అయిజకు చెందిన మమతకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ, పర్దిపురానికి చెందిన లక్ష్మమ్మకు రూ. 36 వేలు, వడ్డేపల్లి మండలం జూలకల్‌కు చెందిన ఆకెపోగు సావిత్రమ్మకు రూ. 6 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, నాయకులు నీలమప్ప, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కేటీదొడ్డి: మండల పరిధిలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేటీదొడ్డి పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ రమణరావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావుతో పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహంలో..

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డెన్‌నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గద్వాల: ప్రభుత్వ పాఠశాల విద్యారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జార్జిరెడ్డి పీడీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, కూరలు నాణ్యత లేకుండా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చాంద్‌పాష, సురేందర్‌గౌడ్, తిరుమలేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



నందిన్నెలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆన్‌లైన్‌లో లైసెన్స్ జారీ ప్రక్రియ ప్రారంభం



లైసెన్స్ అందజేస్తున్న కమిషనర్ శ్రీరాములు

అలంపూర్: పురపాలికలోని వ్యాపారస్తులు ఆన్‌లైన్‌లో లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు సూచించారు. మున్సిపాలిటీలో వ్యాపారస్తులకు ఆన్‌లైన్‌లో లైసెన్స్‌ల జారీ ప్రక్రియను కమిషనర్ మంగళవారం ప్రారంభించారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వ్యాపారుల లైసెన్స్‌లు సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను స్థానిక వ్యావాపారుల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, మున్సిపల్ అధికారులు నారయణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

గద్వాల: నియోజకవర్గంలో గట్టు మండలం రాయాపురం వద్ద 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, గద్వాల, గట్టు, మల్దకల్, ధరూరు మండలాల పరిధిలో ఆరు 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూముల కేటాయింపులు కూడా జరిగాయన్నారు. త్వరలో పనులు మొదలు కానున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలి



గద్వాలన్యూటౌన్: క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు. ఈ నెల 3న హన్మకొండలో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 5 కేఎం వాక్‌రేస్ పోటీల్లో అబ్దుల్ కరీం బాష సిల్వర్ మెడల్, 3 వేల మీటర్ల పరుగు పందెంలో నవీన్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులను మంగళవారం తన చాంబర్‌లో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న, ప్రధాన కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బైక్ ర్యాలీ

గద్వాల: జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 6, 7, 8 తేదీల్లో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక డీకే బంగ్లాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బైక్ ర్యాలీ అనంతరం సమస్యలపై స్థానిక అధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా ఈ నెల 9, 10 తేదీల్లో ప్రవాస్ యోజన కార్యక్రమంలో అన్ని మోర్చాలు ఓ మండలంలో 24 గంటల పాటు ఉండి స్థానిక సమస్యలపై విద్యావంతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, రవి, బండల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

కేటీదొడ్డి: రైతులకు ఆధార్‌కార్డు తీసుకొని మందులు ఇవ్వాలని వారికి ఇబ్బందులు కలుగకుండా యూరియా అందించాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు నందిన్నె, కుచినెర్ల గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో స్టాక్ పరిశీలించి రికార్డులు పరిశీలించారు. ఎరువులు పీఓఎస్ మిషన్ ద్వారానే విక్రయించాలని పేర్కొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించండి

అయిజ: పట్టణంలోని నరసింహ కాలనీలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని తొలగించాలని బీజేపీ నాయకులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి మాట్లాడుతూ.. రాత్రి, పగలు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

బాలలకు ప్రత్యేక హక్కులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

అలంపూర్: రాజ్యాంగంలో బాలలకు ప్రత్యేక హక్కులు కల్పించినట్లు బాలల పరిరక్షణ అధికారి అధికారి జోగు రవి అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాల బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులు కల్పించినట్లు వివరించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం గురించి పేర్కొన్నారు. బాల్య వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. బాల్య వివాహల నిర్మూలనకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే లేబర్ యాక్ట్ ప్రకారం శిక్ష ఉంటుందన్నారు. వేధింపులకు గురైన వారు 1098, 100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ కళావతి, సఖీ కేస్ వర్కర్ స్వాతి, కానిస్టేబుల్ పరుశురాములు, మెడికల్ ఆఫీసర్ షాజహాన్ బేగం, నర్సింహ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న రామాంజనేయులు

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రం విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ అలివేలు

మల్దకల్: పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గద్వాల ఆర్డీఓ అలివేలు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. భూ సమస్యలు తహసీల్దార్ కార్యాలయంలోనే పరిష్కరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. స్థానిక కార్యాలయంలో పరిష్కారం కానీ సమస్యలు ఆర్డీఓ కార్యాలయంలో పరిష్కరించబడతాయన్నారు. వారసత్వ భూములు, సాదా బైనామాల దరఖాస్తులు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీరాణి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సిద్ధప్ప

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ సిద్ధప్ప వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వరూపరాణి, జయమ్మ, సూపర్ వైజర్లు వెంకటస్వామి, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీచుపల్లిలో శ్రీరామ నామ భజనలు



బీచుపల్లిలో శ్రీరామ నామ భజన చేస్తున్న భక్తులు

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా రామదూత కళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామ నామ భజనలు వైభవంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా భజన బృందాల సభ్యులు పాల్గొని శ్రీరామ జయ రామ జయ జయ రామ అనే మంత్రాన్ని జపిస్తూ భజనలు చేశారు. ఆలయంలో 24 గంటల పాటు ఏకదాటిగా రామ జపం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని సరస్వతి అమ్మవారి ఆవరణలో లలితాసహస్ర నామాలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన శ్రీమాత సత్సంగ్ కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో కుంకుమార్చనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు.. రైతులకు లాభదాయకం

ఎర్రవల్లి: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సహకారంతో బీచుపల్లి ఆయిల్‌ఫెడ్ నర్సరీలో ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల్లోని గ్రామీణాభివృద్ధిశాఖ క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 3,500 ఎకరాల ఆయిల్‌పాం సాగు లక్ష్యం కేటాయించినట్లు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ, తెలంగాణ ఆయిల్‌ఫెడ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వందశాతం లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. ఆయిల్‌పాం తోటలతో 30ఏళ్ల వరకు రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. చీడపీడల బెడద తక్కువగా ఉండటంతో పాటు అకాల వర్షాలు, వడగండ్ల వానతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. అంతర పంటలతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్‌పాం తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తుందన్నారు. ఆయిల్‌పాం తోటల సాగుతో కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి శివనాగిరెడ్డి, గద్వాల, అలంపూర్ డివిజనల్ ఉద్యానశాఖ అధికారులు రాజశేఖర్, ఇమ్రానా, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది రామకృష్ణ, త్రివిక్రమ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జయరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. చక్కటి ఆహారపు అలవాట్లు ఆరోగ్యవంతమైన జీవనానికి పునాదులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్ యశోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికలపాడులో వైద్య శిబిరం

మండల పరిధిలోని పెంచికలపాడులో మంగళవారం భవిష్యభారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మురళీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు రాగిణి, సీఓ హలీంపాష పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



గట్టు: మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు ఏఎంఏ అసిస్టెంట్ సతీష్, ఎస్‌బీఎం, ఎంఐఎస్ కన్సల్‌టెంట్ పరుశరాముడు పర్యటించారు. స్వచ్ఛ భారత్ ద్వారా నిర్మించుకొన్న వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనుల గురించి వివరాలు సేకరించారు. అనంతరం బృంద సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీటి వ్యవస్థ, మరుగుదొడ్డి, పరిసరాల పరిశుభ్రం తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.